క్లుప్తంగా

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



బుచ్చిరెడ్డిపాళెం: జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని సీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరులోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో గృహ నిర్మాణాల పురోగతిని శనివారం జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోనే పెద్ద లేఅవుట్‌గా ఉన్న పెద్దూరు లేఅవుట్‌లో దాదాపు 650 ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 70 శాతానికి పైగా గృహ నిర్మాణాలను ప్రారంభించినట్లు చెప్పారు. మిగిలిన నిర్మాణాల పనులను ప్రారంభించి నిర్దేశించిన సమయానికి పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ లబ్ధిదారులు, కాంట్రాక్టర్లు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గృహ లబ్ధిదారులైన పొదుపు మహిళలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని అదనపు వసతులు సమకూర్చుకోవాలని కోరారు. గృహ నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ సుధీర్, గృహనిర్మాణ శాఖ సిబ్బంది మల్లి, కాంట్రాక్టర్ శేషయ్య ఉన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

పొదలకూరు : పాడి రైతులు పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలని వైస్‌ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మరుపూరులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువిజ్ఞాన బడిని శనివారం నిర్వహించారు. గొర్రెలు, దూడలకు నట్టల నివారణ మందు అందజేశారు. ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ మాట్లాడుతూ పాడిరైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పశుబీమాను అమలు చేస్తోందని తెలిపారు. పొదలకూరు ఏడీ కే అరుణ మాట్లాడుతూ పాడి పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రైతులు మంచి పాల దిగుబడులు సాధించేందుకు గేదెలకు దాణాను ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేలటూరు నాగయ్య, తోడేరు పశువైద్యాధికారి ఎస్ శిరీష, జేవీటీ జీ డానియేల్, గోపాలమిత్ర శ్రీను, గొర్రెల కాపర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

కొడవలూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు వస్తున్నాయని ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని ఆలూరుపాడులో జగనన్న సురక్ష సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను ఇంటి వద్దే అందజేస్తుందన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణలతో పాటు ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, పంట సాగుహక్కు పత్రం, కొత్త బియ్యం కార్డు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, విభజన, మ్యుటేషన్ లావాదేవీలను ఎలాంటి ప్రయాసలు లేకుండా పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే ప్రారంభం

పొదలకూరు : మండలంలో జగనన్న సురక్ష సర్వేను శనివారం ప్రారంభించారు. తొలిరోజు డేగపూడి సచివాలయం పరిధిలో తహసీల్దార్ కే వీరవసంతరావు, బిరదవోలు సచివాలయం పరిధిలో ఎంపీడీఓ టీ నగేష్‌కుమారి పర్యటించి సర్వే నిర్వహించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను అడిగితెలుసుకున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను ఇంటి వద్దే అందించనున్నట్లు వారు తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బందికి జగనన్న సురక్ష సర్వేపై దిశానిర్దేశం చేశారు. బిరదవోలులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెల్లూరు డీఎల్‌పీఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. నోడల్ ఆఫీసర్‌గా ఈఓఆర్డీ నరసింహారెడ్డి వ్యవహరించారు.

స్వగృహప్రాప్తిరస్తు..

- జగనన్న కాలనీల్లో చకచకా నిర్మాణాలు
- ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు
- సొంతింటి కోసం దశాబ్దాల పాటు నిరీక్షించిన పేదలు
- సర్వాంగ సుందరంగా ఇళ్లను తీర్చిదిద్దే పనిలో అధికారులు
- నగరపాలక సంస్థ పరిధిలో 19 వేల మందికి గృహాలు

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర వ్యాప్తంగా పేదల కోసం లక్షలాది గృహాలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. పల్లెలు, పట్టణాల్లో జగనన్న కాలనీల నిర్మాణ యజ్ఞం చకచకా సాగుతోంది. పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా గృహాలనే కాకుండా ఏకంగా ఊళ్లనే కడుతోంది. ఫలితంగా లక్షలాది పేద కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోంది. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 19 వేల కుటుంబాలకు ఇళ్లను నిర్మిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అర్హులను గుర్తించి వారికి ఇప్పటికే స్థలాలను అందించారు. సదరు స్థలాల్లో గృహ నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

అధికారుల ప్రత్యేక శ్రద్ధ

జగనన్న కాలనీల్లో నిర్మాణాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు, సలహాలిస్తూ నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ఎవరి స్థాయిలో వారు ఇంటి నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు చేపడుతున్నారు.



వెంకటేశ్వరపురం సమీపంలోని జగనన్న కాలనీ

నియోజకవర్గం	లబ్ధిదారులు	లేఅవుట్ల సంఖ్య	గృహాలకు కేటాయించిన మొత్తం
నెల్లూరు నగర	9293	10	రూ.176 కోట్లు
నెల్లూరు రూరల్	10237	07	రూ.200 కోట్లు



ఇదీ నిర్మాణ తీరు..

- నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇంటి స్థలాలను అందజేశారు. సదరు స్థలాల్లో జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.
- నెల్లూరు నగర నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారుల సంఖ్య 9293. ఆయా కుటుంబాలకు వెంకటేశ్వరపురం, కొండ్లపూడి, ఇనమడుగు ప్రాంతాల్లో 10 లేఅవుట్లు వేసి అందులో స్థలాలను కేటాయించారు. రూ.176 కోట్లకు పైగా కేటాయించడంతో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. పునాదుల దశలో 1843, బేస్‌మెంట్ లెవల్లో 5331, స్లాబ్ దశలో 524, చివరి దశలో 1055 ఇళ్లు నిర్మాణాల్లో ఉండగా, 540 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి.
- నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో నగరపాలక సంస్థకు చెందిన పలు డివిజన్లలో నివసిస్తున్న 10237 కుటుంబాలను అర్హులుగా గుర్తించారు. అక్కచెరువుపాడు – 4, అంబాపురం, గుండ్లపాళెం, వావిలేటిపాడులో ఒకటి చొప్పున మొత్తం ఏడు లేఅవుట్లు వేసి అందులో స్థలాలను కేటాయించారు. ఆయా స్థలాల్లో దాదాపు రూ.200 కోట్లతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. పునాది దశలో 4638, బేస్‌మెంట్ లెవల్లో 3499, రూఫ్ లెవల్లో 387, స్లాబ్ దశలో 678, పూర్తయినవి 948 ఉన్నాయి.

ఒక్కో ఇంటికి రూ.2.15 లక్షల ఖర్చు

జగనన్న కాలనీల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.15 లక్షలను వెచ్చిస్తున్నారు. ప్రభుత్వం నుంచి రూ.1.8 లక్షలను మంజూరు చేయగా, మిగిలిన రూ.35 వేలను పొదుపు ద్వారా బ్యాంక్ నుంచి రుణ సదుపాయంగా కల్పించి ఆ మొత్తాన్ని నిర్మాణానికి ఖర్చు చేస్తున్నారు. నిర్మాణం పూర్తి కాగానే లబ్ధిదారుడు గృహ ప్రవేశం చేసుకుంటున్నారు. పేదలకు దశాబ్దాలుగా నెరవేరని కలను ప్రస్తుత ప్రభుత్వం సాకారం చేస్తోంది.

చాలా సంతోషంగా ఉంది



ఇప్పటి వరకు మాకు సొంతిల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఇల్లు లేదని గత ప్రభుత్వ హయాంలో అర్జీని సమర్పించినా ప్రయోజనం లభించలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో వలంటీర్ మా ఇంటికొచ్చి స్థలం కోసం అర్జీని సమర్పించాలని సూచించారు. అర్జీని అందజేసిన కొద్ది రోజులకే ఇంటి స్థలం మంజూరైంది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేసి పట్టాను సైతం ఇచ్చారు. ఇంటిని నిర్మిస్తుండటంతో చాలా సంతోషంగా ఉంది.

– నాగవేణి, న్యూ కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్

సొంతింటి కల నెరవేరింది



ఎన్నో ఏళ్లుగా అద్దింట్లో ఉంటున్నాం. నా భర్త బంగారు పని చేస్తారు. పనులు సక్రమంగా లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందిగా ఉంటోంది. ఇంటి బాడుగను సైతం సక్రమంగా కట్టలేక అనేక అవస్థలు పడుతున్నాం. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక సొంతింటి కల సాకారమైంది.

– షాహిదా, న్యూ కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్

చాలా కాలానికి ఇంటి స్థలం వచ్చింది



నా భర్త పెయింట్ పనికెళ్తుంటారు. రోజూ వచ్చే కూలి కుటుంబాన్ని పోషించుకునేందుకే సరిపోతోంది. బాడుగింట్లో ఉంటూ అద్దెను సక్రమంగా కట్టలేక అనేక అవస్థలు పడుతున్నాం. ఇలాంటి సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేవుడిలా వచ్చి ఇంటి స్థలాన్ని మంజూరు చేసి గృహాన్ని సైతం నిర్మిస్తుండటంతో చాలా సంతోషంగా ఉంది.

– అలివేలు, న్యూ కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్

క్రైమ్ కార్నర్

బైక్ దొంగ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): బైక్ చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడ్ని చిన్నబజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రమణయ్యకు చెందిన బైక్‌ను గుర్తుతెలియని దుండగులు ఈ నెల 18న అపహరించుకెళ్లారు. ఈ నెల 22వ తేదీ రాత్రి రమేష్‌రెడ్డినగర్‌లోని ఓ హాస్పిటల్ వద్ద వాచ్‌మెన్ కృష్ణయ్యను కత్తితో బెదిరించి గుర్తుతెలియని వ్యక్తి స్కూటీని అపహరించుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుల మేరకు చిన్నబజార్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్సై సైదులు, క్రైమ్ పార్టీ సిబ్బందితో కలిసి ఘటన స్థలాలను పరిశీలించారు. సాంకేతికత ఆధారంగా గాంధీనగర్‌కు చెందిన రోషన్ జమీర్‌ను నిందితుడిగా గుర్తించారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మూలాపేటలోని సీఎం స్కూల్ కాంపౌండ్‌లో గల పాడుబడిన గది వద్ద నిందితుడు శనివారం ఉన్నాడనే పక్కా సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని నుంచి కత్తి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై దాడి చేసిన నిందితుడిపై వేదాయపాళెం పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చంద్రమౌళీనగర్‌లో నివాసం ఉంటున్న వెంకటాచలం మండలం నిడిగుంటపాళెనికి చెందిన బాలయ్య మార్నింగ్ వాక్‌కు ఈ నెల 19న వెళ్లారు. ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తి అతనిపై కారం పొడిచల్లి రాయితో దాడి చేసి కాళ్లు, చేతులతో కొట్టారు. బాలయ్య పెద్దగా కేకలేయడంతో స్థానికులు రావడాన్ని గమనించిన నిందితుడు పరారయ్యారు. దాడి చేసిన వ్యక్తి ఎవరనే అంశాన్ని ఆరాతీయగా, నిడిగుంటపాళెనికి చెందిన ప్రసన్నకుమార్‌గా తేలింది. గతంలో ప్రసన్నకుమార్‌కు అదే ఊర్లోని ఓ మహిళకు వివాదం ఉంది. ఆ గొడవను బాలయ్య సర్దుబాటు చేయడంతో ప్రసన్నకుమార్ కక్ష పెంచుకొని దాడికి పాల్పడ్డారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

టీడీపీ పతనం ఖాయం



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాజయం పాలై పూర్తిగా పతనమవుతుందని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 27వ డివిజన్లో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపనను శనివారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, అయితే రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందంటూ టీడీపీ నేతలు ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కొన్ని పచ్చ పత్రికలు టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వంపై అసత్య కథనాలను ప్రచురిస్తున్నాయని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలకంటే మిన్నగా చేస్తామని టీడీపీ నేతలు ప్రకటించడాన్ని విమర్శించారు. నారా లోకేష్ ఎన్ని పాదయాత్రలు చేసినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా మారాయన్నారు. 27వ డివిజన్‌కు రూ.1.2 కోట్లను మంజూరు చేయగా, రూ.40 లక్షలతో పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను చేయాల్సి ఉందని తెలిపారు. నియోజకవర్గంలో ఏ సమస్య లేకుండా అభివృద్ధి పనులకు నిధులను కేటాయిస్తామని వెల్లడించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ నేతలు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మద్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, కుమార్, శ్యామ్‌సింగ్, శ్రీను, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుల నిర్వీర్యం తగదు



మాట్లాడుతున్న నాగేంద్రసాయి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలోని సహకార బ్యాంకులను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఇది తగదని నెల్లూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి పేర్కొన్నారు. నగరంలోని టౌన్‌హాల్లో బ్యాంక్ 107వ మహాజన సభను శనివారం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన 13 మంది బ్యాంక్ సభ్యులకు సంతాపంగా నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి గానూ బ్యాంక్ షేర్ ధనం రూ.2,48,212 లక్షలుగా ఉందని, అదే విధంగా రూ.66.15 లక్షల ఆదాయంలో ఉందని వివరించారు. రుణాలపై వడ్డీల రూపంలో రూ.9.62 లక్షలు, పెట్టుబడులపై వడ్డీ రూ.2.98 లక్షలు బ్యాంక్‌కు వచ్చాయని తెలిపారు. జిల్లాల విభజనానంతరం బ్యాంక్ సేవలను కందుకూరు వరకు విస్తరించామని వివరించారు. బ్యాంక్‌లో డిపాజిట్లకు బీమా సౌకర్యం ఉందని, గృహ నిర్మాణాలకు రూ.50 లక్షల వరకు రుణాలను ఇస్తున్నామని చెప్పారు. బంగారు ఆభరణాలపై 8 శాతం వడ్డీతో రూ.15 లక్షల వరకు రుణాలను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బ్యాంక్ ఖాతాదారుల పిల్లలకు రూ.ఐదు వేలను అందజేశారు. బ్యాంక్‌కు సకాలంలో రుణాలు, వడ్డీని చెల్లిస్తున్న పలువురు ఖాతాదారులను సత్కరించారు. బ్యాంక్ వైస్ చైర్మన్ శ్రీనాథ్, డైరెక్టర్లు వినోదిని, మహేశ్వరి, విజయకోటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, అమర్‌ఖాసిం, నాగలక్ష్మి, శ్రీనివాసమూర్తి, లతీఫ్‌అహ్మద్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లులను ఆదివారం యథావిధిగా చెల్లించొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేయనున్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘జెనెక్స్’ విద్యార్థులకు అభినందన



నెల్లూరు (టౌన్): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో జెనెక్స్ విజన్ అకాడమీకి చెందిన ఇద్దరు విద్యార్థులు ఏడాదికి రూ.18 లక్షల చొప్పున, రూ.పది లక్షలకుపైగా ప్యాకేజీని పది మంది విద్యార్థులు సాధించడాన్ని వీఎస్‌యూ వీసీ సుందరవల్లి అభినందించారు. వీఎస్‌యూలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్రమశిక్షణ, దృఢ సంకల్పంతో కూడిన విద్యను అభ్యసించడంతోనే విద్యార్థులు పూజ, వేణుగోపాల్ నాయక్ అత్యధిక ప్యాకేజీని సాధించారని చెప్పారు. కళాశాల డైరెక్టర్లు వెంగళ్‌రెడ్డి, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను డీటీసీ చందర్ వివరించారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు 2286 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, నగరంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు 105 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లను క్షుణ్ణంగా పరిశీలించి సిగ్నళ్ల ఏర్పాటు, హైమాస్ట్ లైట్లను అమర్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీఆర్సీ కూడలిలో లైటింగ్‌ను మెరుగుపర్చాలని, ఎస్పీ కార్యాలయం నుంచి డైకస్ రోడ్డు వరకు తాత్కాలికంగా డివైడర్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒక వైపు అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని సూచించారు. నగరంలో ప్రైవేట్ బస్సులను ఇష్టానుసారంగా నిలుపుతున్నారని, స్టాపింగ్ పాయింట్లను గుర్తించి అక్కడే నిలిపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంగం నుంచి ఆత్మకూరు వెళ్లే మార్గంలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. హెల్మెట్లను ప్రతి ఒక్కరూ ధరించేలా అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడారు. మనుబోలులోని జాతీయ రహదారి సమీపంలో గల పెట్రోల్ బంకు వద్ద లైటింగ్‌ను మెరుగుపర్చాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. ఆటో డ్రైవర్లకు పోలీసులు అవగాహన కల్పించి, పరిమితికి మించి తరలించకుండా చర్యలు చేపట్టాలన్నారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఈఓ గంగా భవానీ, డిప్యూటీ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవీకుమారి, ఆర్ అండ్ బీ ఎస్‌ఈ గంగాధర్, ప్రజా రవాణా అధికారి శేషయ్య, డీసీహెచ్ రమేష్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ



నెల్లూరు (టౌన్): ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధనపై నగరంలోని డీకే డబ్ల్యూ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. 53 మంది అధ్యాపకులకు శిక్షణ ఇచ్చామన్నారు. ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రెయినర్లు శిక్షకులుగా వ్యవహరించారని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ రమణరావు, తదితరులు పాల్గొన్నారు.

పాటలు, డ్యాన్స్ పోటీలు నేడు

నెల్లూరు(బృందావనం): ఏవీకే ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పురమందిరంలో పాటలు, డ్యాన్స్ పోటీలను ఆదివారం నిర్వహించనున్నామని నిర్వాహకుడు కేతా సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కులో శనివారం ఆవిష్కరించారు. నాగేశ్వరరావు, రఘురామిరెడ్డి, దుర్గం మధుసూదన్ పాల్గొన్నారు.

శ్రీధర్‌రెడ్డికి సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ సెల్ జిల్లా చైర్మన్‌గా మరోసారి ఎన్నికైన శ్రీధర్‌రెడ్డిని శనివారం సత్కరించారు. పొగతోటలోని ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ అభినందనలను తెలియజేశారు. రూబెన్, బాబు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణను శనివారం నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వల్లీ దేవసేన అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలుగా ఓరుగంటి వెంకటసుబ్రహ్మణ్యం, అనిల్‌కుమార్, కవిత వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.

హెచ్చరిక నోటీసు

నా కక్షిదారుడు అయిన అయితా కొండలరావు తండ్రి వెంకటేశ్వర్లు, సంతపేట, నెల్లూరు వారు ఇచ్చిన సంజాయిషీ మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా, ఈ క్రింది షెడ్యూలు దాఖల ఆస్తికి సంబంధించి గౌరవనీయులైన నెల్లూరు 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో O.S.No.241/2015 లో రాచపూడి సునీతకును మరియు నా కక్షిదారుకు ఇతరులకు మధ్య దావా పెండింగ్‌లో ఉన్నది. సదరు ఆస్తికి సంబంధించి నా కక్షిదారుడు సర్వ సంపూర్ణ హక్కు కలిగి మరియు వాటి యొక్క ఒరిజినల్ పత్రములు కలిగి ఉన్నారు. నా కక్షిదారుడు తెలియునది ఏమనగా కొంత మంది ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని సదరు పై వ్యాజ్యమును కప్పిపుచ్చి అమ్ముచూపుటకు ప్రయత్నము చేయుచున్నారని తెలిసినది. కావున ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎవ్వరైన కొన్నయెడల నా కక్షిదారునికి బద్ధగించదు. అట్లు జరిపిన యెడల వారిపై నా కక్షిదారుడు సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడును.

SCHEDULE

SPSR Nellore District - Nellore Sub-registration District - Nellore Corporation - Nellore Bit-1 - Kondayapalem Area - Ummareddygunta - Constructed house with its vacant site vide its **Plot No.31 in Sy.No. 2058/3 - D.No.25-2/1736-1** - terraced house an extent of **21 Ankanams** out of **30 Ankanams** and also **15 Ankanams** towards eastern side vacant site and in total extent of site of **45 Ankanams** bounded by :-

East : Land belongs to Government,
South : House belongs to C.Yesu Ratnam,
West : Road,
North : House belongs to Madrasu Bujjamma.

with in this boundaries 21 Ankanams of constructed house in Ground floor out 45 Ankanams of vacant site with its all easementary Rits.

సయ్యద్ కాషిఫ్ M.A., B.Ed., L.L.B.,
అడ్వకేటు, నెల్లూరు